సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023

భక్తిశ్రద్ధలతో షబ్-ఏ-మెరాజ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో శనివారం రాత్రి ముస్లింలు షబ్-ఏ-మెరాజ్ (జగ్నేకి రాత్)ను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మసీదుల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నగరంలోని వివిధ మసీదుల్లో మత గురువులు మాట్లాడారు. ప్రత్యేక నఫీల్ నమాజులు, దువాలు, తహజ్జు నమాజ్‌లు చేశారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు.

దైవ సన్నిధానంలో మాజీ ఉపరాష్ట్రపతి పూజలు



బంజారాహిల్స్: భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిలింనగర్ దైవ సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు 'సండే ఫన్‌డే'

లక్డీకాపూల్: ట్యాంక్‌బండ్‌పై నేడు సండే ఫన్‌డే పునః ప్రారంభం కానుంది. ఫార్ములా ఈ రేసింగ్‌తో కొన్ని వారాలుగా ఈ కార్యక్రమం నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇకపై ప్రతి ఆదివారం సాయంత్రం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై వాహనాలకు రాకపోకలకు అనుమతి ఉండదు. సందర్శకుల కోసం 4 పార్కింగ్ జోన్‌లను ఏర్పాటు చేశారు.

న్యూస్‌రీల్

ఫాంహౌస్‌లపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

- మద్యం బాటిళ్లు స్వాధీనం
- ఆరుగురిపై కేసు నమోదు



ఓ ఫాంహౌస్‌లో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్న మద్యం బాటిళ్లు

మొయినాబాద్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఫాంహౌస్‌లపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తున్నవారిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకమామిడి సమీపంలో ఉన్న సెలబ్రిటీ ఫాంహౌస్, ఎటర్నిటీ ఫాంహౌస్, సజ్జన్‌పల్లి సమీపంలో ఉన్న ముషీరుద్దీన్ ఫాంహౌస్‌ల్లో శుక్రవారం రాత్రి ఎలాంటి అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తున్నట్లు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న వారు 44 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫాంహౌస్‌లు నడుపుతున్న నిర్వాహకులు, యజమానులపై కేసులు నమోదు చేశారు. సెలబ్రిటీ ఫాంహౌస్ వాచ్‌మన్ సుధాకర్, యజమాని ప్రశాంత్, ఎటర్నిటీ ఫాంహౌస్ వాచ్‌మెన్ పటేల్ రాజు, యజమాని వై.నరేష్‌కుమార్‌రెడ్డి, ముషీరుద్దీన్ ఫాంహౌస్ వాచ్‌మన్ స్వామి, యజమాని ముషీరుద్దీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల్ని అతిక్రమించిన పబ్‌లు

నలుగురిపై కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్ జోన్ పరిధిలోని 16 పబ్‌లలో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ) పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందులో హార్ట్ కప్, బర్డ్ బాక్స్ పబ్‌లు నిబంధనలను అతిక్రమించినట్లు పోలీసులు గుర్తించారు. హార్ట్ కప్ పబ్ నిర్వాహకులు మైనర్లను పబ్‌లోకి అనుమతి ఇస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో వెంటనే పబ్ యజమాని పవన్ కుమార్, మేనేజర్ ఆదిత్యా తమాంగ్‌లపై కేసులు నమోదు చేశారు. సరైన లైసెన్స్ లేకుండా నడుస్తున్న బర్డ్ బాక్స్ పబ్ యజమాని వంశీ వర్ధన్, మేనేజర్ పి.అర్జున్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఓటీ డీసీపీ ఎంఏ రషీద్ తెలిపారు.

26న పర్యావరణ పరిరక్షణపై చిత్ర లేఖన పోటీలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పర్యావరణ పరిరక్షణపై ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ఇందిరాపార్కులో ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.పి.హెచ్.రంగయ్య, గౌరవాధ్యక్షుడు ఉప్పల వెంకటేష్‌గుప్తా తెలిపారు. ఔత్సాహిక విద్యార్థులు తమ పేరు, వయసు, తరగతి, స్కూల్ తదితర వివరాలతో 83339 49623, 99663 31427లను సంప్రదించాలని సూచించారు.

మెట్రో రైలు వేళల్లో మార్పులు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రైలు వేళలను తిరిగి సవరించినట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొన్నటి వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ సందర్భంగా రాత్రి 12 గంటల వరకు మెట్రో రైళ్లు నడిచాయి. ప్రస్తుతం ఎగ్జిబిషన్ ముగియడంతో పాత పద్ధతిలోనే చివరి ట్రిప్పు రాత్రి 11 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్బీనగర్, మియా పూర్, నాగోల్, రాయదుర్గం, జేబీఎస్ టర్మినల్ స్టేషన్‌ల నుంచి చివరి మెట్రో రైళ్లు బయలుదేరుతాయి. రాత్రి 12 గంటల వరకు గమ్యస్థానానికి చేరుకుంటాయి.

శివోహం



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు క్యూ కట్టారు. ఊరూవాడా శివనామస్మరణతో మార్మోగాయి. ఉపవాసదీక్షలు, జాగరణలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయం, షాద్‌నగర్ పరిధిలోని రామేశ్వరంలో రద్దీ నెలకొంది. ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. మరోవైపు పండ్ల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి.



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో బారులుతీరిన భక్తులు



కడ్తాల్: మైసిగండిలో నంది విగ్రహం నుంచి కాశీవిశ్వనాథుడి దర్శనం



కడ్తాల్: మైసిగండిలో నందీశ్వరుడికి దీపం వెలిగిస్తున్న భక్తురాలు



షాద్‌నగర్: రామలింగేశ్వరస్వామి దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

రూపుమార్చ‘బడి’



ఇది శంకరంపల్లి మండలం టంగుటూరు జిల్లా ప్రజాపరిషత్ ప్రభుత్వ పాఠశాల. ఇక్కడ సుమారు 500 మంది విద్యార్థులు వివిధ తరగతులు చదువుతున్నారు. మనఊరు -మనబడిలో భాగంగా టాయ్‌లెట్లు నిర్మించారు. పెయింటింగ్ వేశారు. పాత గేటు స్థానంలో కొత్తది అమర్చారు. విద్యార్థులు కూర్చునేందుకు ఫర్నిచర్, విద్యుత్, తాగునీటి సదుపాయం కల్పించారు. ఒకప్పుడు శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలకు తీసిపోనివిధంగా కనిపిస్తోంది.



ఇది కొత్తూరు మండలం తిమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల. ఇక్కడ 250 మంది పిల్లలు చదువుతున్నారు. ఏడాది క్రితం కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా లేవు. ఎండకు ఎండి వానకు తడిసేవారు. మన ఊరు మనబడితో బడి రూపురేఖలు మారిపోయాయి. ఒకప్పుడు దుమ్ము ధూళితో నిండిపోయిన పాఠశాల ప్రాంగణం ప్రస్తుతం కార్పొరేట్ హంగులతో అలరిస్తోంది.



ఇది జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాల. జిల్లాలోనే అత్యధికంగా 1,250 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏడాది క్రితం విద్యార్థుల నిష్పత్తికి తగినన్ని తరగతి గదులు, మౌలిక సదుపాయాలు ఉండేవి కావు. చెట్ల కింది మధ్యాహ్నం భోజనం చేయాల్సి వచ్చేది. ప్రభుత్వం ఈ స్కూలును పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసింది. రూ.కోటి ఖర్చు చేసి అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, వాకింగ్ ట్రాక్, గార్డెన్, గోడలకు రంగులు, అందమైన పెయింటింగ్స్ వేయించింది. స్కూలు భవనంపై 4 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేశారు.

'మన ఊరు-మనబడి'తో సర్కారు బడులకు మహర్దశ

- కార్పొరేట్‌కు దీటుగా అన్ని హంగులతో ముస్తాబు
- విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సకల సౌకర్యాలు
- జిల్లాలో రూ.99.45 కోట్లతో 464 స్కూళ్లలో అభివృద్ధి పనులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సర్కారు బడి రూపు మారుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు- మనబడి'లో భాగంగా జిల్లాలోని 464 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.99.45 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో ఇప్పటికే 54 స్కూళ్లను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. పాఠశాల భవనానికి రంగులతో పాటు ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు, డైనింగ్ హాల్, కిచెన్‌షెడ్డు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. అదనపు తరగతి గదులు, ప్రహరీల నిర్మాణం మినహా పనులు పూర్తి కావచ్చాయి.

ప్రారంభానికి సిద్ధంగా 54 పాఠశాలలు..

'మన ఊరు- మనబడి'లో భాగంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లెలగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతోపాటు శివరాంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.2 కోట్లతో వీటిని కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. మొదటి విడతలో 464 బడులను ఎంపిక చేసి, వీటిలో 448 స్కూళ్లలో రూ.97.88 కోట్లతో పనులు చేపట్టారు.

పాఠశాలల పునః ప్రారంభం నాటికి పూర్తి

ఒక్కో పాఠశాలలో రూ.30 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ధరలు గిట్టుబాటు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. కొన్ని చోట్ల పనులు ప్రారంభమైనా..మెజార్టీ పాఠశాలల్లో పెండింగ్‌లోనే ఉన్నాయి. కాంట్రాక్టర్లు ముందుకు రాని ప్రాంతాల్లో ఏం చేయాలా అని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. వేసవి సెలవుల్లోగా పనులు పూర్తి చేసి.. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఆయా స్కూళ్లను అందగా ముస్తాబు చేయించాలని కృతనిశ్చయంతో ఉన్నారు.

అభివృద్ధి పనుల అంచనా.. ఇప్పటి వరకు బిల్లు చెల్లింపు

అంశం	కేటాయించిన బడ్జెట్	బిల్లు చెల్లింపు
అదనపు తరగతి గదుల నిర్మాణం	రూ.29,91,50,058	రూ.8,96,66,601
తాగునీటి సరఫరా పనులు	రూ.5,97,34,702	రూ.35,97,217
ప్రహరీల నిర్మాణం	రూ.4,88,70,392	రూ.5,74,649
విద్యుద్దీకరణ పనులు	రూ.8,17,26,500	రూ.1,46,11,204
డైనింగ్ హాల్స్	రూ.20,11,31,113	రూ.6,80,143
టాయ్‌లెట్స్ విత్ రన్నింగ్ వాటర్	రూ.6,64,40,861	రూ.9,28,888
కిచెన్ షెడ్ల నిర్మాణం	రూ.2,39,50,261	రూ.2,00,048
మేజర్ అండ్ మైనర్ వర్క్స్	రూ.24,35,55,927	రూ.1,92,81,806

ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు



ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దారు. చాలా అందంగా, ఆహ్లాదకరంగా ఉంది. చదువుకునేందుకు మంచి వాతావరణం. ఇంతకు ముందు ఫర్నిచర్ లేక నేలపై కూర్చోవాల్సి వచ్చేది. మట్టిలో నడవాల్సి వచ్చేది. దుమ్ముధూళితో ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం గేటు నుంచి తరగతి గదివరకు సీసీ వేశారు. కాలికి మట్టంటకుండా తరగతి గదిలో అడుగుపెట్టే అవకాశం లభించింది.

– తరుణబేగం, 10వ తరగతి, జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాల

దేశానికే రోల్ మోడల్



దేశంలోనే తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలు రోల్ మోడల్‌గా మారాయి. మొదటి విడతలో రూ.7 వేల కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 9,123 పాఠశాలల్లో పనులు చేపట్టాం. ఇప్పటికే పలు స్కూళ్లలో పనులు పూర్తి కాగా.. మరికొన్ని చోట్ల కొనసాగుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయిస్తాం. సీఎం కేసీఆర్ అంకుఠిత దీక్షతోనే ఇది సాధ్యమవుతోంది. ఈ పథకం కింద ఎంపిక కాని పాఠశాలలకు అదనపు నిధులు కేటాయించాం.

– సబితారెడ్డి, విద్యాశాఖ మంత్రి

ప్రభుత్వానిది నయవంచన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- ఉమ్మడి జిల్లా రైతులను నమ్మించి మోసం చేశారు
- చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: ఉమ్మడి జిల్లా రైతులను ముఖ్యమంత్రి కేసీఆర్ నమ్మించి మోసం చేస్తున్నారని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. చేవెళ్లలో శనివారం సాయంత్రం ఆయన బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకు వచ్చే ప్రాణహిత ప్రాజెక్టు డిజైన్‌మార్చి నీళ్లు రాకుండా చేశాడని మండిపడ్డారు. ప్రాణహిత కాదు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారానే జిల్లాకు సాగునీరు అందిస్తామని ఇన్నాళ్లు ప్రచారం చేసిన వీరు ఇప్పుడు ఈ ప్రాజెక్టు కేవలం తాగునాటి అవసరాలకోసమే నిర్మిస్తున్నామని సుప్రీంకోర్టుకు నివేదించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పిన మాట అవాస్తవమని వారి మాటల్లోనే అర్థం అవుతోందన్నారు. కేసీఆర్‌కు ఈప్రాంత ప్రజలపై ఎంత ప్రేమ ఉందో ఇప్పటికైనా స్పష్టత వచ్చిందన్నారు. పాలమూరు ప్రాజెక్టు పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మిస్తుండటంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.828 కోట్లు పరిహారం చెల్లించాలని ఆదేశించినట్లు తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీ కోర్టుకు వెళ్లి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సాగునీటి అవసరాల కోసం కాదని కేవలం తాగునీటి అవసరాలకే నిర్మిస్తున్నామని స్పష్టం చేసిందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఇన్నాళ్లు పాలమూరు రంగారెడ్డి ద్వారా సాగునీటిని అందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చిందన్నారు. ఉమ్మడి జిల్లాలో విలువైన భూములను అమ్ముకుంటోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేసీఆర్ నిజస్వరూపం ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, నియోజకవర్గం నాయకులు వర్రీ తులసీరామ్ విజయ్‌కుమార్,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యాక్షులు వెంక్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, నాయకులు భాస్కర్, అశోక్, చంద్రశేఖర్, రాములు తదితరులు ఉన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత

టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



జిమ్నాస్టిక్స్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం సీఎం కోహినూర్ కప్ ఇంటర్నేషనల్ రిథమిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్-2023ను రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత క్రీడలు, క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో స్పోర్ట్స్ స్టేడియంలు నిర్మిస్తున్నారని చెప్పారు. క్రీడాకారులు వారివారి విభాగాల్లో చక్కగా రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయం సాధించి దేశానికి, రాష్ట్రానికి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆఫ్ స్పోర్ట్స్ ఇండియాతో కలిసి ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు చాంపియన్ షిప్-2023 నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో 5 దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులు, వివిధ రాష్ట్రాలు, జిల్లాల క్రీడాకారులు సుమారు 200 మంది పోటీ పడతారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఈడబ్ల్యూ ఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్, అధ్యక్షుడు రవినాయక్, మహేశ్, గణేశ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా భక్తులకు మెరుగైన సేవలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అఖండ జ్యోతియాత్ర ప్రారంభం



అఖండ జ్యోతియాత్రను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి 29వ అఖండ జ్యోతి యాత్రను శనివారం బర్కత్‌పురాలోని యాదాద్రి భవన్ వద్ద అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబులతో కలిసి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో యాదాద్రి ఆలయ ఫౌండర్ ట్రస్టీ సభ్యుడు బి.నరసింహమూర్తి, ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీ నరసింహాచార్యులు, జ్యోతియాత్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుమారి ఎంఎస్ ధరణి, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, కార్పొరేటర్ వై.అమృత, దేవిరెడ్డి విజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం తరఫున దేశ వ్యాప్తంగా 150 దేవాలయాల్లో భక్తులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

శివగంగ.. భక్తకోటి మురవంగా



శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి దంపతులు



ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి..

- రాజరాజేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ప్రముఖుల విశేష పూజలు

మహేశ్వరం: స్థానిక శివగంగ రాజరాజేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి పండుగను పరస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శివనామస్మరణలతో నియోజకవర్గంలోని శివాలయాలన్నీ మారుమోగాయి. మంత్రి సబితారెడ్డి శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తామన్నారు. సీఎం కేసీఆర్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులను తీసుకోస్తామన్నారు. గతంలో తాను ప్రత్యేక చొరవ తీసుకొని ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో సౌఖ్యంగా వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. రాజరాజేశ్వర ఆలయం అతిపురాతనమైనదని, మహేశ్వరంలో కొలువుతీరడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టమని మంత్రి అన్నారు. అనంతరం మంత్రిని శాలువా, జ్ఞాపికతో ఆలయ చైర్మన్, డైరెక్టర్లు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఆలయంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలు స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎల్బీనగర్ డీసీపీ సన్‌ప్రీత్ సింగ్, జడ్జి తిరుపతి ప్రత్యేక పూజలు చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో చల్లంగా ఉండాలని రాజరాజేశ్వర స్వామిని వేడుకున్నారు. ఆలయం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. అలాగే బీజేపీ సీనియర్ నాయకుడు అందెల శ్రీరాములు యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డిలతో పాటు పలువురు బీజేపీ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివగంగ ఆలయం చుట్టూ దుకాణాలు వెలియడంతో జాతర సందడి నెలకొంది. పోలీసులు పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టారు. రాత్రి వేళ ఆలయం ఆవరణంలో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మహేశ్వరం ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, ఎంపీడీఓ నర్సింహ, మహేశ్వరం ఏసీపీ అంజయ్య, సీఐ మధుసూదన్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకున్నారు.

అప్పుల విషయమై గొడవ

భర్త ఆత్మహత్య

మీర్‌పేట: అప్పుల విషయమై భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. బడంగ్‌పేట గాంధీనగర్‌కు చెందిన ఆవుల శ్రీను (36) వృత్తిరీత్యా డ్రైవర్. కొంత కాలంగా మద్యానికి బానిసైన శ్రీను అప్పులు చేశాడు. ఇదే విషయమై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో శనివారం అప్పుల విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీను గదిలోకి వెళ్లి ఇనుప రాడ్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. మృతుడి సోదరుడు కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ క్రైమ్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని బీజేపీ నాయకుడు ఓం ప్రకాశ్ ఆరోపించారు. మంత్రి తలసాని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన పోస్టులపై కరీంనగర్‌కు చెందిన తమ కార్యకర్త పరంధామయ్య కామెంట్ చేస్తే అతనిపై పోలీసులు కక్షపూరితంగా వ్యవహరించి అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరంధామయ్య అరెస్టును నిరసిస్తూ శనివారం రాత్రి బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైమ్ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ధర్నా చేశారు. సామాజిక మాధ్యమాల్లో పెట్టే పోస్టులపైన కామెంట్ చేస్తే అరెస్టు చేయడం దారుణమన్నారు.

ఆర్థిక వ్యవస్థకు పారిశ్రామికవేత్తలే వెన్నెముక



ఆదాయ పన్ను శాఖ కమిషనర్ జీవన్‌లాల్

సాక్షి, సిటీబ్యూరో: భారతీయ ఆర్థిక వ్యవస్థకు పారిశ్రామికవేత్తలే వెన్నెముక అని ఆదాయ పన్ను శాఖ కమిషనర్ జీవన్‌లాల్ తెలిపారు. బిజినెస్ మింట్ 40వ నేషన్ వైడ్ అవార్డుల ప్రదానోత్సవాన్ని శనివారం హెచ్ఐసీసీలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యాపారం, ఫ్యాషన్, విద్య, వైద్యం, సోషల్ వర్క్, హాస్పిటాలిటీ, ఫుడ్ ఇండస్ట్రీ తదితర రంగాలలో నిష్ణాతులను ఎంపిక చేసి అవార్డులను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదాయపు పన్నుశాఖ కమిషనర్ జీవన్‌లాల్ తోపాటు ఏపీ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జెఎ చౌదరి, తెలంగాణ ఐటీ డిపార్ట్‌మెంట్ ఓఎస్డి ఎల్. రమాదేవి, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ ప్రెసిడెంట్ కరుణ గోపాల్ వర్తకవి, ఏజీహబ్ సీఈఓ విజయ్ నడిమింటి, భారత రాష్ట్ర సమితి మహిళా అధ్యక్షురాలు సోఫియా హసీబ్ సిద్ధిఖీ పాల్గొని విజేతలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌లాల్ లావిడియ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసమేనని.., పరిశ్రమలు, స్టార్టప్‌ల నుంచి అందజేసే సొమ్మును కూడా ప్రజల సేవల కోసం వెచ్చిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఉద్యోగాలు, అదనపు సేవలు, విలాసవంతమైన జీవితాన్ని, భవిష్యత్తు కోసం మెరుగైన ప్రపంచాన్ని సృష్టించినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. స్నిగ్ధా గౌడ్, డానుబ్ హోమ్, ఐరన్ హిల్ బ్రూవరీ, ఎలిసియన్ ఇండస్ట్రీస్ ప్రై.లి. లిమిటెడ్., సుఖి గ్రూప్, ఇన్‌ఫ్లోన్, గ్లోబల్ ఫార్మా టెక్, కాఫ్లియో గ్లోబల్, సిమ్ - సామ్స్, ఎన్ఈడీ- న్యూ ఎరా డయాగ్ తదితరులు అవార్డులు అందుకున్నారు.